క్లుప్తంగా

నేడు ఆసరా లబ్ధిదారుల సమావేశాలు

సామర్లకోట: మహిళా సంఘాలలోని సభ్యులకు ఆసరా వచ్చిన మొత్తంపై వివరించడానికి బుధవారం పట్టణ, మండల పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాలలోని సభ్యులకు అచ్చంపేట జగనన్న లే అవుట్‌లోను, పట్టణ పరిధిలో పదో వార్డు పెదమిల్లు ఆవరణలోను సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.ప్రశాంతి, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మందులు అందజేస్తున్న వైద్యులు

కొత్తపల్లి: ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని సర్పంచి నక్క మణికంఠబాబు అన్నారు. మండలంలోని అమినాబాద్ గ్రామ జచివాలయం-2లో మంగళవార ం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 368 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ తెలిపారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం సిఫార్సు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పట్టణ వాసులతో మాట్లాడుతున్న పోలీసులు

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో అందరూ ఓటు వేసే విధంగా శాంతి భద్రతల రక్షణకు ప్రజల భాగస్వామ్యంతో చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలో మంగళవారం పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఓటు హక్కును అందరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలని కోరారు.

బస్సు పై నుంచి జారి పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ మృతదేహం

కొత్తపల్లి, కాకినాడ క్రైం: తన సామాన్లు దింపేందుకు బస్సు పై కప్పు ఎక్కిన ఓ ప్రయాణికుడు ప్రమాద వశాత్తూ జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. సంబంధిత వివరాలివీ... ఉప్పాడ కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన 75 ఏళ్ల రెడ్నం సత్యనారాయణ మంగళవారం కాకినాడకు వచ్చి సరకులు కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో తిరిగి ప్రయాణమయ్యాడు. కాకినాడ నుంచి అద్దరిపేట వెళ్లే బస్సు ఎక్కి అమీనాబాద్‌లో దిగాడు. కాకినాడలో బస్సు ఎక్కినప్పుడు బస్సు పై కప్పుపై కట్టిన తన సామాన్ల మూటలు దించుకునేందుకు డ్రైవర్‌కి చెప్పకుండా పైకి ఎక్కాడు. ప్రయాణికులంతా దిగిపోయారని భావించిన డ్రైవర్ బస్సు స్టార్ట్ చేసి ముందుకు వెళ్లడంతో సత్యనారాయణ బస్సు పైనుంచి జారి ఒక్కసారిగా కిందికి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: పురుగులు మందు డబ్బాలో మద్యం పోసుకుని తాగిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండెవరం శివారు కాశివారిపాకలకు చెందిన జిగటాల నాగబాబు(38) ఈ నెల ఒకటో తేదీన పొలం గట్టుపై ఉన్న పురుగుల మందు డబ్బాలోని మద్యం పోసుకుని సేవించాడు. అప్పటినుంచి నాగబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఐదో తేదీన కాకినాడ ప్రభుత్వ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

కొత్తపల్లి: మద్యం మత్తులో ఒక వ్యక్తి బీరు సీసాతో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్తమూలపేటకు చెందిన ఆవాల మణికంఠ మంగళవారం రాత్రి ఒక కిరాణా షాపు వద్ద జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన బీరా ప్రకాష్ తోపాటు తన తండ్రిపై బీరు సీసా పగలగొట్టి గాయపరిచాడు. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధీమాగా ఉంటే బీమా రాదు..!

- ముద్ర పడకపోతే పరిహారం లేదు..!
- ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి
- గ్రామాల్లో అధికారుల ప్రచారం



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

పిఠాపురం: రైతుల పరిభాషలో చెప్పాలంటే ప్రభుత్వం 'పొయ్యకాడ ఆకుమడిలా' అన్ని వసతులు వారి కాళ్ల దగ్గరకే తెచ్చి పెడుతోంది. కాని కొందరు రైతులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. తీరా నష్టం జరిగాక పరిహారం రాలేదంటూ ఆవేదన చెందుతున్నారు. అధికారుల విన్నపాలను పట్టించుకుని సహకరిస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదు ప్రారంభమవ్వడంతో రైతులను సమాయత్తం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అన్నం పెట్టే రైతన్నకు ఆసరా కల్పించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం రైతుకు పూర్తి స్థాయిలో సేవలందించేందుకు కృషి చేస్తోంది. ఆ దిశగా క్షేత్ర స్థాయిలో అడుగులు పడుతున్నాయి. రైతు సంక్షేమమే ధ్యేయమంటూ అంటు ప్రసంగాలు గుప్పించి సమావేశాలు పెట్టి చేతులు దులుపుకునే గత పాలకులకు భిన్నంగా ప్రతి రైతుకు సేవా సదుపాయాలు అందే దిశగా ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియతో వ్యవసాయ అనుబంధ శాఖ సేవలన్ని రైతుకు ఏ ఇబ్బంది లేకుండా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

విస్తృత ప్రచారం

రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుకు సంబంధించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాల పాలైతే ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండానే రైతుకు నష్టపరిహారం అందెలా ఆయా రైతుల పేరున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించనుంది. రైతులకు సూచనలు సలహాలు అందించడానికి నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలోను అధికారులు ఈ-క్రాప్‌పై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో ఏ రైతు ఇతర గ్రామాలు వెళ్లనక్కరలేదు తమ గ్రామంలోనే ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ వేయించుకుంటే సరిపోతుంది. పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాఫ్ నమోదు చేయించుకోవాలని అధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి మరీ రైతులకు వివరిస్తున్నారు.

నియోజకవర్గంలో రైతులు	
గొల్లప్రోలు మండలం మొత్తం రైతులు	10441
కొత్తపల్లి మండలం మొత్తం రైతులు	8166
పిఠాపురం, పట్టణం, మండలం మొత్తం రైతులు	17311

ఈ-క్రాప్ నమోదుకు 15 వరకే గడువు

అన్ని మండలాల్లోనూ ఈ-క్రాప్ నమోదు ప్రారంభించాం. ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంది. అందరూ తమ పొలాలు, పంటల వివరాలను సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలి. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీ ఆర్సీ కార్డు తీసుకువెళ్లాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సమాచారం ఇచ్చి అందరిని సిద్ధం చేస్తున్నారు. పంటల బీమా రావాలన్నా, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు రావాలన్నా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. వరితో పాటు మొక్కజొన్న, ప్రత్తి, మల్బరీ, అపరాలు, మామిడి, జీడిమామిడి ఇలా ఏ పంటలైనా సరే ఈ-క్రాప్ చేయించుకోవాల్సిందే.

– పి.స్వాతి, వ్యవసాయ శాఖ ఏడీఏ, పిఠాపురం

నేరాల నియంత్రణలో ప్రత్యేక నిఘా అవసరం

- ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి
- డీఎస్పీ లతాకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై సిబ్బంది ప్రత్యేక నిఘా ఎంతో అవసరమని డీఎస్పీ లతాకుమారి అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో క్రైం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమన్నారు. నేరాల అదుపులో ఉంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ ఆదేశించారు. అనంతరం స్టేషన్ వారీగా ఉన్న కేసుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో సీఐ రవికుమార్, డీఎస్పీ కార్యాలయ ఏఎస్ఐ కృష్ణతో పాటు ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

డీఎంహెచ్ఓ నరసింహ నాయక్

సామర్లకోట: సచివాలయాల పరిధిలో వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆయన ఆరా తీసి లబ్దిదారులకు వేగంగా అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులపై రూ.25 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకొనే అవకాశం కల్పించిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మంజూరైన కార్డులను కుటుంబ సభ్యులకు అందజేసి వారి నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు ఉండడం వలన ఆరోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు వారిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ మేరకు మూడో సచివాలయం పరిధిలో సిబ్బందిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు లబ్ధిదారులకు డీఎం అండ్ హెచ్ఓ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సామర్లకోటలో ఆరోగ్యశ్రీ కార్డులను లబ్దిదారులకు అందజేసిన డీఎం అండ్ హెచ్ఓ నాయక్



కార్డులు పంపిణీపై ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

కొత్తపల్లి: ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. రమణక్కపేటలో జరుగుతున్న ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఈ కార్డుల ద్వారా వైద్యం ఖర్చును రూ.25లక్షలకు పెంచిందన్నారు. మండలంలో 25,570 కార్డులు వచ్చాయన్నారు. వీటిలో ఇప్పటి వరకూ 80 శాతం కార్డులు పంపిణీ చేశామన్నారు. వారం రోజుల్లో కార్డులు పంపిణీని పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు.

జగన్‌తోనే సొంతింటి కల సాకారం

- నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి
- లబ్ధిదారులకు ఇంటి పట్టాలు, తాళాల అందజేత



టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: పేదవారి సొంతింటి కల సాకారం చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలోని టిడ్కో లబ్ధిదారులకు మంగళవారం స్థానిక వాలు తిమ్మాపురం రోడ్డులోని టిడ్కో గృహ సముదాయం వద్ద ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలను ఆయన అందజేశారు. చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు, వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న గృహ సముదాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం, అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి తాళాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కేవి పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, పప్పల దుర్గారావు, ఆరెళ్ళి వీర్రాఘవులు, కట్టా రాజు బాబు, చింతా శ్రీనివాసరావు, నీలంశెట్టి పండు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి

పెద్దాపురం: వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు మరింత ఆర్థిక భరోసా తీసుకువచ్చిందని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీలో భాగంగా మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలుచేసి సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. మహిళా సాధికారతతో పాటు అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కులను దొరబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీపీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లల గోవిందు, జోడుగుళ్ల ఆలయ చైర్మన్ మేడిద వెంకట రామారావు, పెంటా విజయకుమార్, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, ఉప్పటి ప్రసాద్, బండారు చంటిబాబు, శేషకుమారి, ఏలేటి అనంతలక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న దొరబాబు

గ్రంథాలయానికి వీడిన గ్రహణం

మీసేవ కేంద్రంలోకి మార్పు



మార్చిన గ్రంథాలయం ఇదే..

పిఠాపురం: ఎంతో కాలంగా అద్దె భవనంలో ఉంటున్న పిఠాపురం శాఖ గ్రంథాలయాన్ని పిఠాపురం పాత బస్టాండ్ వద్ద ఉన్న పాత మీసేవ కేంద్రంలోకి మార్చినట్లు గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలో ఉండడంతో పాఠకులకు అరకొర సౌకర్యాలు మాత్రమే ఉండడంతో ఇబ్బందులకు గురయ్యేవారని ఆయన తెలిపారు. ఆ విషయంపై మున్సిపల్ చైర్ ప్రసన్ గండేపల్లి సూర్యావతి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో గతంలో మూతపడి ఉన్న మున్సిపల్ మీసేవ కేంద్రంలోకి గ్రంథాలయాన్ని మార్పు చేయాలని కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. దీనిపై గ్రంథాలయానికి మీసేవ కేంద్రాన్ని కేటాయిస్తు మున్సిపల్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జిల్లా గ్రంథాలయ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గ్రంథాలయాన్ని మీసేవ కేంద్రంలోకి మార్చినట్టు ఆయన తెలిపారు.

రిజిస్ట్రేషన్లు వేగంగా పూర్తి చేయాలి



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ లక్ష్మి



పొన్నాడలో రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

- ఆన్‌లైన్‌లో ఉచిత పట్టాల విలువ గుర్తింపు
- సచివాలయ అడ్మిన్ కార్యదర్శుల సమావేశంలో సబ్ రిజిస్ట్రార్

సామర్లకోట: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇచ్చిన పట్టాలను ఆయా సచివాలయాల్లో వేగంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సబ్ రిజిస్ట్రార్ ఇ.లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబార్‌లో సచివాలయాల అడ్మిన్ కార్యదర్శుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పేదలకు ఇచ్చిన స్థలాల విలువను సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సమక్షంలో 2020 లోనే గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరచినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ వార్డులను పరిగణలోనికి తీసుకొని రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో ఎటువంటి అనుమానాలు ఉన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యలను పరిష్కరించడానికి రిజిస్ట్రార్ కార్యాలయాలకు చెందిన అధికారులు, సాంకేతిక సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆమె సూచించారు. మున్సిపల్ కమిషనర్ రామారావు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం మేరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. సచివాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు కార్యదర్శులు సమయం కేటాయించాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

కొత్తపల్లి: మండలంలో జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు ఇచ్చిన 4814 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ తెలిపారు. పొన్నాడ గ్రామ సచివాలయం-2లో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆయా గ్రామ సచివాలయాల్లో బుధవారం నుంచి రిజిస్ట్రేషన్లు జరుగుతాయని చెప్పారు.

గుబాళిస్తున్న గులాబ్‌జామ్



వనఖండ్రవాడలో గులాబ్‌జామ్ చెట్లు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గులాబ్‌జామ్ కాయలు

- స్థానికంగా పంట.. అందుబాటులో ధరలు
- లాభాలు ఆర్జిస్తున్న రైతులు

పిఠాపురం: చలి తగ్గ ముఖం పట్టింది. ఎండలు ముదురుతున్నాయి. దాహం తీర్చే పండ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో దారి పొడవునా పండ్ల దుకాణాలు దర్శనమిస్తున్నాయి. వేసవిలో దాహం తీర్చి శరీరానికి మంచి పోషక విలువలు ఇచ్చే గులాబ్ జామ్ (వాటర్ యాపిల్) పిఠాపురం నియోజకవర్గంలో రైతులు అంతర పంటగా సాగు చేస్తు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మండలంలో వనఖండ్రవాడతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో ఉన్న నర్సరీలో ఈ మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడ సాగు చేసిన గులాబ్‌జామ్ చెట్లు విరగకాస్తుండడంతో మంచి ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో చెట్టు ఈ సీజన్‌లో 250 కేజీల వరకు కాపు కాస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కేజీ రూ.60 వరకు ధర పలుకు తుండడంతో రోజుకు 20 నుంచి 30 కేజీల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ఒక్కో చెట్టు రోజుకు 10 కేజీల వరకు దిగుబడి వస్తుండగా ఇక్కడ మామిడి, కొబ్బరి తోటల్లో అంతర పంటగా వేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని రైతు అప్పారావు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గులాబ్‌జామ్ ప్రస్తుతం స్థానికంగా లభిస్తుండడంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు. నర్సరీల్లో ఒక్కో మొక్క రూ.150 నుంచి 300 వరకు అమ్ముతున్నారు. వివిధ తోటల్లోనే కాకుండా ఇళ్ల వద్ద వీటిని పెంచుతున్నారు. ప్రస్తుతం పిఠాపురం మార్కెట్‌లోను ఇవి లభిస్తున్నాయి. ఉప్పాడ, పిఠాపురం రోడ్డులో తాజా గులాబ్‌జామ్ కాయలు విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో కడియం వంటి ప్రాంతాల్లో నర్సరీలలో మాత్రమే దొరికే ఈమొక్కలు ఇక్కడ అందుబాటులోకి రావడంతో పలువురు కొనుగోలు చేసి తోటల్లోను ఇళ్ల వద్ద పెంచుతున్నారు. ఆరోగ్యకరమైన పళ్లతో పాటు ఆదాయం వస్తుండడంతో అందరు వీటిపై మొగ్గుచూపుతున్నారు. స్థానికంగా అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులకు అందుబాటు ధరలో దొరుకుతున్నాయి.

సమగ్ర సస్య రక్షణతో రైతులకు మేలు

ఉద్యాన శాఖాధికారి సుజాత

పెద్దాపురం: రైతులు సమగ్ర యాజమాన్య సస్య రక్షణ పోషక పద్ధతులు పాటిస్తే రైతులకు మేలు జరుగుతుందని మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, పతంజలి ఫుడ్స్ డీజీఎం రవీంద్ర అన్నారు. మండలంలోని ఉలిమేశ్వరం, ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి సుజాత అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ సమగ్ర సస్య రక్షణ చర్యలపై రైతులు మరింత అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతుల్లో సమగ్ర సస్య రక్షణతో పురుగును అరికడితే రైతుకు, పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. తెల్లదోమ 25 రోజుల్లో జీవితక్రం పూర్తి చేసుకుటుందన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 11 వేల హెక్టార్లలో కొబ్బరి, ఆయిల్ పామ్ సాగవుతోందన్నారు. వీటికి రూకోస్ తెల్లదదోమ సోకడం వల్ల ఆకులు నల్లగా మారి దిగుబడి తగ్గుతోందన్నారు. తెల్లదోమ నివారణపై చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ వీహెచ్ఏ ఎం.చిలకమ్మ, పతంజలి ఫుడ్స్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఎల్.వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకట సాయి, వీహెచ్ఏలు చంద్రరావు, మధుతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి సుజాత

జనసేన నేత ఫిర్యాదు వివాదాస్పదం

పిఠాపురం: తనను హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారని నలుగురు యువకులపై మండల జనసేన నేత మాదేపల్లి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివాదాస్పదంగా మారింది. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఫోన్‌లో మాట్లాడుతుండగా నలుగురు యువకులు కత్తులతో తిరుగుతూ తనపై రెక్కీ నిర్వహించారని శ్రీనివాస్ ఎస్సై మురళీమోహన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కార్యాలయం వద్ద సీసీ పుటేజ్ ఆధారంగా నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న యువకుల కుటుంబ సభ్యులు తమ పిల్లలు పెయింటింగ్ పనులు, చెట్లు కొట్టడం చేస్తుంటారని అలాంటి వారిపై హత్యాయత్నం కేసులు పెట్టడం దారుణమని జనసేన నేతలపై నిప్పులు చెరిగారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ దళిత నాయకులతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. అమాయక దళిత యువకులపై తప్పుడు కేసులు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనపై జనసేన నేతలు సంజాయిషీ ఇవ్వక పోతే పార్టీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇది ఇలా ఉండగా నియోజకవర్గ జనసేన నాయకులు ఈ కేసులో అసలు నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ సతీష్‌కుమార్‌కు కాకినాడలో ఫిర్యాదు చేశారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈ నెల 6 నుంచి 8 వరకు జరగనున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు గోవా వెళ్లారు. ఈ సందర్భంగా లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనకు వీడ్కోలు ఇచ్చారు. వెంకట్‌నగర్‌లో లయన్స్ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలైట్ క్లబ్ ఎల్లప్పుడు సముచిత స్థానం ఇస్తుందన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన పర్యటన విజయవంతం అవ్వాలన్న ఆకాంక్షతో లయన్స్ సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు తాను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 62 బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. ఈ పోటీల్లోనూ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. పోటీలలో కూడా తప్పక విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణేష్, సాగర్, రంగాభట్ల శ్రీనివాస్, పరశురామ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.